క్లుప్తంగా

టీకాలు వేయించాలి

శాయంపేట : ఆడదూడలకు, లేగలకు బ్రూసెల్లోసిస్ ఉచిత టీకాలను వేయించుకోవాలని పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి సునీల్ అన్నారు. మండలంలోని పెద్దకోడెపాకలో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత టీకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టగా ముఖ్యఅతిథిగా సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మాచర్ల మంగమ్మ రవి, వావిలాల వేణుగోపాల ప్రసాద్, వీఏల్వో రమేష్‌బాబు, జేవీవో సారంగం, రమాదేవి, పాల్గొన్నారు.

పట్టాలు అందించాలి



ఎల్కతుర్తి : నిరుపేదలు ఆక్రమించుకున్న భూములకు పట్టాలు అందజేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూరారం గ్రామశివారులోని 566 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలు వేసుకున్న గుడిసెవాసులకు వెంటనే పట్టాలు అందించాలని కోరారు. అలాగే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు కర్రె లక్ష్మణ్, నిమ్మల మనోహర్, మర్రి విజయ్, తండ మొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఎల్కతుర్తి: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్సై జక్కుల పరమేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్, రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్‌గౌడ్, జిల్లా సమితి సభ్యులు కుమార్, వినయ్, సాయి, ప్రభాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎంపీడీఓ

ధర్మసాగర్(వేలేరు): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఎంపీడీఓ జవహర్‌రెడ్డి తన వాహనంలో ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నాడు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం బండతండా నుంచి వేలేరుకు కారులో వెళ్తున్నాడు. అదే సమయంలో బండతండా కమ్మరిపేట గ్రామాల మధ్య సోమవారం ట్రాలీ ఆటో, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఎంపీడీఓ ఆ వ్యక్తిని తన వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

నేటి నుంచి 'కంటివెలుగు'

పరకాల: పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో మంగళవారం నుంచి కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజిపేట పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రాన్ని చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ ప్రారంభిస్తారన్నారు. ఫిబ్రవరి 4 వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

శాయంపేట : మండలంలోని పత్తిపాకలో సీసీ రోడ్డు పనులను స్థానిక సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి సహకారంతో నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోతుగంటి సరోజన మల్లయ్య, మాజీ సర్పంచ్ దుబాసి కృష్ణమూర్తి, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్, గంటా శ్యాంసుందర్ రెడ్డి, ఐల్లయ్య, చేరాలు, సాంబయ్య, రవీందర్, కిరణ్, సాంబరాజు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

భీమదేవరపల్లి: మండల కేంద్రానికి చెందిన చేరాల శ్రీనివాస్ అదే గ్రామానికి చెందిన నార్లగిరి రమేష్‌ల మధ్య కుటుంబ వ్యవహారాల్లో దాడులు చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. చేరాల శ్రీనివాస్‌కు మంజుల, వెన్నెల ఇద్దరు భార్యలు కాగా మొదటి భార్య మంజుల శ్రీనివాస్ మధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయమై రెండు రోజుల క్రితం శ్రీనివాస్ బావ రమేష్ ఇంటి వద్ద గొడవ జరిగి కత్తులతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో రమేష్‌తోపాటు మరోవ్యక్తి విట్టు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో రమేష్ కుటుంబ సభ్యులు ఆవేశంతో శ్రీనివాస్‌పై దాడి చేసేందుకు ఆయన ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో శ్రీనివాస్ లేకపోవడంతో అతని రెండో భార్య వెన్నెలపై దాడి చేయగా ఆమె తీవ్రంగా గాయపడింది. గాయపడిన వారు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. కాగా, సోమవారం ఇరువర్గాలు పోలీస్‌లకు వేర్వేరుగా ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు ముల్కనూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నిధులు మంజూరు చేయాలి

- జెడ్పీచైర్మన్‌ను నిలదీసిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు
- వాడీవేడిగా సాగిన మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

ఎల్కతుర్తి : మధ్యలో నిలిచిన జీపీ భవన నిర్మాణానికి, బావుపేట, జీల్గుల గ్రామాలకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరీ చేయాలని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సభలో జెడ్పీ చైర్మన్‌ను నిలదీశారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేకల స్వప్న అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం సోమవారం వాడీవేడిగా కొనసాగింది. ముందుగా అధికారులు తమ నివేదికలను చదివి వినిపిస్తుండగా కొత్తగా దరఖాస్తు చేసుకున్న రైతులకు రైతుబంధు డబ్బులు రావడం లేదని బావుపేట ఎంపీటీసీ ఇంద్రసేనారెడ్డి అన్నారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ సునీత నివేదిక చదువుతుండగా కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎప్పుడు మంజూరు చేస్తారని పలువురు ఎంపీటీసీలు అడిగారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కార్డులు అందజేస్తామని తెలిపారు. కంటివెలుగు కార్యక్రమంలో లబ్ధిదారులకు సమయానికి కంటి అద్దాలు ఇవ్వడం లేదని జీల్గుల సర్పంచ్ ఆరోపించారు. మధ్యలో నిలిచిన జీపీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరీ చేస్తే ఆ పనులను తామే నిర్వహిస్తామని బావుపేట సర్పంచ్ దాట్ల రాముడు తెలిపారు. ఐబీ అధికారులు సమావేశానికి గైర్హాజర్ కావడంతో



నిధులు విడుదల చేయాలని నిలదీస్తున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు

గ్రామాల్లోని ఊర చెరువు తూముల్లో నెలకొన్న సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు అడిగితే జెడ్పీలో నిధులు లేవని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతారా అంటూ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఇంద్రసేనారెడ్డి, రాముడు, మాల్లారెడ్డి సమావేశాన్ని బైకాట్ చేసి బయటకు వెళ్లిపోయారు. మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం లేదని దీంతో పంటపొలాలు ఎండిపోతున్నాయని పలువురు ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారిని నిలదీయగా మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఆశాఖ ఏఈ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు.

తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశంలో ఎక్కడా జరగడం లేదు : జెడ్పీ చైర్మన్

తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడ జరగడం లేదని జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ అన్నారు. తెలంగాణలో బీడు బారిన భూములను పచ్చని మాగాణిగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణ రాష్ట్రంపై నేడు కేంద్రప్రభుత్వం వివక్ష చూపిస్తుందన్నారు. వివక్షతకు వ్యతిరేఖంగా పోరాటం సాగించే సమయం దగ్గరపడిందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ తూర్పాటి సునీత, సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవిందర్‌గౌడ్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

దామెర : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ కాగితాల శంకర్ సూచించారు. మండలంలోని ఊరుగొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సోమవారం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులు స్పీకర్, ప్రధానమంత్రి, ప్రతిపక్షనాయకులు, పలు శాఖల మంత్రులు, ఎంపీలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీలు తమ నియోజకవర్గ సమస్యలపై ప్రశ్నించగా సంబంధిత మంత్రులు సమాధానాలు తెలిపిన తీరు పలువురిని ఆకట్టుకుంది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని అన్నారు. రానున్న రోజుల్లో దేశాన్ని పాలించే విధంగా తయారుకావాలని సూచించారు. స్పీకర్‌గా పావని, ప్రధానమంత్రిగా మహమ్మద్ సమీన వ్యవహరించగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎండీ.జాకిర్ అలీ, దళితబంధు చైర్మన్ గరిగె క్రిష్ణమూర్తి, సర్పంచ్ గోగుల సత్యనారాయణ రెడ్డి, అడహక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

'దళితబంధు'లో రాజకీయ జోక్యం తగదు



కరపత్రం విడుదల చేస్తున్న నవీన్

ధర్మసాగర్: దళితబంధు పథకంలో రాజకీయ నాయకుల జోక్యం ఉండకూడదని టీఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పుట్ట నవీన్ కోరారు. జాతీయ నాయకుడు మేడి పాపన్న, రాష్ట్ర నాయకుడు వంగపల్లి శ్రీనన్న పిలుపు మేరకు ఫిబ్రవరి 3న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు, 14న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద జరిగే దండోరా మహాదర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ధర్మసాగర్‌లో సోమవారం కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి దార విజయకాంత్, సోంపెల్లి తరుణ్, పుట్ట సందీప్, బొడ్డు రాహుల్, సదిరం రజినీకాంత్, కొట్టె బాబు, మేకల సునీల్ రాజ్, సోంపెల్లి అఖిల్, చిలుక జగన్, మాచర్ల రవి, మాచర్ల సోమయ్య, పవన్ పాల్గొన్నారు.

అగ్రంపహాడ్ జాతరకు ఏర్పాట్లు పూర్తి



సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్న ఏసీపీ

ఆత్మకూరు : అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ మినీ జాతరకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు ఈఓ గుల్లపెల్లి శేషగిరి తెలిపారు. అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి మినీ జాతర జరుగుతుందని జాతరకు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. భక్తులకు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సోమవారం రాత్రి పరకాల ఏసీపీ శివరామయ్య, సీఐ గణేష్ సమ్మక్క-సారలమ్మలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై జాతరను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పూజారులు సాంబశివరావు, సారంగపాణి, వెంకన్న, ఎంపీపీ మార్క సుమలత, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక, సర్పంచ్ మాదాసి అన్నపూర్ణ, ఎంపీటీసీ భాగ్య, చైర్మన్ గుండెబోయిన రాజన్న, పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఈ సామ్యనాయక్

దామెర : రైతులు వ్యవసాయ బావుల వద్ద మోటార్లకు విద్యుత్‌కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని డీఈ సామ్యనాయక్ సోమవారం సూచించారు. మండలంలోని పసరగొండలో రైతులకు అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో విద్యుత్ వినియోగం అధికంగా ఉన్నందున మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లపై లోడు పడకుండా ఉండి, కాలిపోకుండా ఉంటాయన్నారు. కెపాసిటర్లు అమర్చుకోవడంతో నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ 5 హెచ్‌పీ మోటార్‌కు 2 కేవీఆర్, 7.5 హెచ్‌పీ మోటార్‌కు 3 కేవీఆర్ కెపాసిటర్లు అమర్చుకోవాలని సూచించారు. సదస్సులో పరకాల ఏడీఈ జె.దేవేందర్, దామెర ఏఈ గుర్రం రమేష్, లైన్‌ఇన్స్‌పెక్టర్లు, లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, పాల్గొన్నారు.

భారత్ జోడో యాత్ర విజయవంతం



రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు

కమలాపూర్: రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర విజయవంతమైందని మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కశ్మీర్‌లో భారత్ జోడో యాత్ర ముగిసిన సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో కొండ రమేష్, కంభంపాటి ప్రసాద్, కిన్నెర కృష్ణమూర్తి, బాలపురి కనుకరత్నం, బైరి సత్యనారాయణ, సముద్రాల కృష్ణ, కుక్కల ఓదెలు, హనుమాన్ ప్రసాద్, భిక్షపతి పాల్గొన్నారు.

నేటి తరానికి మహాత్మాగాంధీ స్ఫూర్తిదాయకం



పరకాల: గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



నడికూడలో..



ధర్మసాగర్‌లో..

పరకాల/నడికూడ/ధర్మసాగర్/ఎల్కతుర్తి/ కమలాపూర్ : భారత స్వాతంత్ర్యం కోసం అహింస మార్గంలో ఉద్యమం చేసిన మహనీయుడు మహాత్మాగాంధీని నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మండల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నడికూడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో కుమార స్వామి, రాజు, విజేందర్, పాపిరెడ్డి, ప్రశాంత్,సేరేందర్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ధర్మసాగర్‌లోని గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిన్నింటి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి సోమవారం నివాళులర్పించారు. వేలేరు ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్, అత్తెన రాజేందర్, శంకర్, ప్రశాంత్, మల్లయ్య, రాజు, శివ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు. ఎల్కతుర్తి మండలంలోని వివిధ గ్రామాలతో దండేపల్లిలో యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మండ సుమన్‌గౌడ్ మహాత్ముని విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రయాణికులకు పండ్లు పంపిణీ చేశారు. సుమన్, శ్రీనివాస్, రాజేష్, రమేష్ పాల్గొన్నారు



ఎల్కతుర్తిలో..

శాయంపేట గాంధీచౌక్‌లో గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళుర్పించారు. భాస్కర్, రమేష్, రవిపాల్, మార్కండేయ, రఫీ, రాజు, కట్టయ్య, సమ్మయ్య, పాల్గొన్నారు. కమలాపూర్ ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. నటరాజశేఖర్, సంఘం అధ్యక్షుడు కొనిశెట్టి మునీందర్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు పున్నంచందర్, సాగర్‌బాబు, వీరభద్రయ్య, శివకుమార్, విజయ్‌కుమార్, పాల్గొన్నారు.



కమలాపూర్‌లో..

అభివృద్ధిని అడ్డుకుంటున్న కేంద్ర ప్రభుత్వం

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



పరకాల : లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

పరకాల : తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం పరకాల, ఆత్మకూరు, దామెర , నడికూడ మండలాలకు చెందిన కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను 116 మందికి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల్లోని ఆడపిల్లలకు కల్యాణలక్ష్మీ ఒక వరంగా మారిందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా ప్రతి నెలా గ్రామ పంచాయతీలకు నిధులు అందిస్తుందన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ బండి సారంగపాణి, పరకాల, నడికూడ ఎంపీపీలు స్వర్ణలత, అనసూర్య, జెడ్పీటీసీలు సిలువేరు మొగిళి, కోడెపాక సుమలత, మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, కౌన్సిలర్స్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

భవనాల నిర్మాణం త్వరలో పూర్తిచేస్తాం

దామెర : మండల కేంద్రంలో గ్రామపంచాయతీ, మహిళా సమాఖ్య నూతన భవనాలు త్వరలో పూర్తి పూర్తి చేస్తామని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. కార్యాలయాలు నిర్మించేందుకు అనువైన స్థలం కోసం సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి, ఆవరణతో పాటు బస్టాండ్‌లో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించి భవనాలు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. అందరికీ ఆమోదమోగ్యమైన స్థలంలో జీపీ భవనాల నిర్మాణం చేసేలా చూడాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ ఎండీ.రియాజుద్దీన్, రైతు బంధు కోర్డినేటర్ బిల్లా రమణారెడ్డి. ఎంపీపీ కాగితాల శంకర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృపాకర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీరాం రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శంకర్, రాజు, కిషోర్, రాకేష్ ఉన్నారు. అనంతరం వాహనంలో వెళ్తున్న ఎమ్మెల్యేను గ్రామానికి చెందిన కొంతమంది రైతులు తమకు చెందిన గుట్ట నుంచి మొరం తరలిస్తున్నారని వెంటనే నిలిపివేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ భూమికి సంబంధించిన పత్రాలతో అధికారులను కలవాలన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



శాయంపేట : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సర్పంచ్ అరికిళ్ల ప్రసాద్ అన్నారు. మండలంలోని మైలారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం గ్రామానికి చెందిన బయోజెమ్స్ ఫెస్టిసైడ్స్ కరీంనగర్ జిల్లా సేల్స్ ఆఫీసర్ బత్తిని తిరుపతి చేపట్టారు. పంచాయతీలో పనిచేస్తున్న ఆరుగురు మల్టిపర్పస్ వర్కర్లకు గ్లౌజులు, టీషర్టులు, టవల్స్ పంపిణీ చేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ విజయవిజయ్‌కుమార్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాజిరెడ్డి, హెచ్‌ఎం లక్ష్మణ్, పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

కమలాపూర్ : తెలంగాణ రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ మంగళవారం కమలాపూర్‌లో పర్యటించనున్న నేపథ్యంలో మండలానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. సోమవారం వేకువజాము నుంచే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా ముందు జాగ్రత్త చర్యగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సుమారు 37 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ తెలిపారు. అరెస్ట్ చేయడాన్ని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. పోలీసుల అదుపులో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ శోభన్‌బాబు, బ్లాక్ కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలసాని రమేష్‌గౌడ్, మండల అధ్యక్షుడు గుండపు చరణ్‌పటేల్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భిక్షపతి, ఎంపీటీసీ కొండం శ్రీనివాస్ ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ధర్మసాగర్(వేలేరు): కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే భారత్ జోడోయాత్ర విజయవంతం కావాలని వేలేరు ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ కోరారు. స్థానిక రుద్రరామేశ్వరస్వామి ఆలయంలో హాత్ సే హాత్ అభియాన్ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి కావాలని పార్టీ మండల అధ్యక్షుడు పిన్నింటి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. రాజేందర్, శంకర్, ప్రశాంత్, రాజు, శివ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

60 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జ్



కాంగ్రెస్ ఇన్‌చార్జ్ నాయకులతో మహేష్, బుచ్చిరెడ్డి

ఐనవోలు : గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి 60 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జ్‌ను నియమించే కార్యక్రమం మండల కాంగ్రెస్ చేపడుతోంది. మండలంలోని వనమాల కనపర్తి, నర్సింహులగూడెం, ముల్కలగూడెం గ్రామాల్లో 60 మంది ఓటర్లకు ఒక కాంగ్రెస్ నాయకున్ని ఇన్‌చార్జ్‌గా సోమవారం నియమించారు. ఈ సందర్భంగా మండల నాయకుడు సమ్మెట మహేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను ఇన్‌చార్జీలు తెలుసుకుని పార్టీకి తెలియజేయాలన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతారన్నారు. పేద ప్రజల కష్టాలు తెలిసిన కాంగ్రెస్‌ను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రూపిరెడ్డి సాయిరెడ్డి, పోలెపల్లి బుచ్చిరెడ్డి, కూస చిరంజీవిరెడ్డి, మేటి చిరంజీవి, మనపాటి రాజు, రిపీక ఎల్లస్వామి, ఇలా సారపు రాజు, మీర్ మహ్మద్, గడ్డం సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

దళితులపై వివక్ష చూపొద్దు



మాట్లాడుతున్న ఎస్సై పరమేష్

ఎల్కతుర్తి: ఎవరైనా దళితులపై వివక్ష చూపించినట్లు తెలిస్తే ఎంతటివారైనా సరే ఉపేక్షించేది లేదని ఎస్సై జక్కుల పరమేష్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఇందిరానగర్‌లో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తుల నుద్దేశించి మాట్లాడుతూ అంటరానితనం నిర్మూలపై వి వక్ష చూపించరాదన్నారు. కులంపై దూషించినా ప్రేరేపించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అందరూ ఐక్యతగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి, సర్పంచ్, వార్డు సభ్యులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.